సాక్షి తిరుపతి

బుధవారం। 24। మే। 2023



ప్రయోగానికి జీఎస్ఎల్వీ 12 సిద్ధం

జీఎస్ఎల్వీ ఎఫ్12 ప్రయోగానికి షార్‌లో శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేస్తున్నారు.

- 8లో



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం వర్షం కురిసింది.

- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	39	28
తిరుమల	36	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా గోవిందుని మహా సంప్రోక్షణ



మహా హారతి ఇస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో మహా సంప్రోక్షణలో భాగంగా మంగళవారం వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, కుంభారాధన, పంచగవ్యా రాధన చేపట్టారు. తర్వాత విశేష హోమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు వివిధ వైదిక కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద జీయంగారు, చిన్న జీయంగారు, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు, డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సన్నద్ధం

- శరవేగంగా జగనన్న లే అవుట్లలో ఇంటి నిర్మాణాలు
- జూన్‌లో 15,427 ఇళ్ల ప్రారంభోత్సవం



వెంకటేశ్వర్లు, పీడీ గృహ నిర్మాణశాఖ

తిరుపతి అర్బన్: జగనన్న లేఅవుట్లలో నిర్మించిన ఇళ్లకు జూన్‌లో సామూహిక గృహ ప్రవేశాలు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జూన్‌లోగా 15,427 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, 15,640 ఇళ్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 70,480 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. దశల వారీగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో వైఎస్సార్ గ్రామీణ్ పేరుతో 5వేల ఇళ్లు ప్రభుత్వం నిర్మిస్తోందని పేర్కొన్నారు. వీటిలో 213 ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. 2024 మార్చి 31వ తేదీ నాటికి వంద శాతం నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇవ్వడమే కాకుండా రూ.20వేలు విలువ చేసే నాలుగు ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా అందిస్తోందని చెప్పారు. పొదుపు సంఘాల నుంచి 3 శాతం వడ్డీతో రూ.35 వేలు అందిస్తోందని తెలిపారు. సిమెంట్‌కు సంబంధించి 90 బస్తాలకు రూ.100 చొప్పున 9వేలు రాయితీ, నాణ్యమైన కమ్మి ఇస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం సాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

పరికరాల పండుగ

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఏటా పెట్టుబడి సాయం..సబ్సిడీ ఎరువులు..బీమా సౌకర్యం..పంటలకు గిట్టుబాటు ధర తదితరాలతో వ్యవసాయాన్ని పండుగలా మార్చుతోంది. సీహెచ్‌సీ (కస్టమ్ హైరింగ్ సెంటర్) గ్రూపులను ఏర్పాటు చేసి రైతులకు ట్రాక్టర్లు, నాగళ్లు, రోటోవేటర్లు, వరికోత యంత్రాలు తదితర 42 రకాల పరికరాలను సబ్సిడీతో అందిస్తోంది. జిల్లాలో రెండో విడత 158 సీహెచ్‌సీలకు 901 పరికరాలను పంపిణీ చేసింది. అందులో 73 ట్రాక్టర్లు ఉన్నాయి. ఇందుకోసం రూ.13.44 కోట్లు వెచ్చించగా.. అన్నదాతలు రూ.4.49కోట్లు సబ్సిడీ పొందారు.



చిట్టమూరు వ్యవసాయ కార్యాలయంలో పరికరాల పంపిణీ



కోట మండల వ్యవసాయ కేంద్రంలో పరికరాలు అందుకుంటున్న రైతులు

- ఊరూరా...రెండో విడత
- 158 సీహెచ్‌సీలకు 901 సాగు పరికరాల పంపిణీ
- 73 ట్రాక్టర్ల అందజేత
- రూ.13.44 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- అన్నదాతలకు రూ.4.49 కోట్ల సబ్సిడీ

తిరుపతి అర్బన్: జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల నుంచి సీహెచ్‌సీ గ్రూపుల ద్వారా రైతులకు ట్రాక్టర్లు, వరికోత యంత్రాలతోపాటు 42 రకాల వ్యవసాయ పరికరాలు అందడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది. ఈనెల 20వ తేదీ నుంచి రెండో విడతలో భాగంగా 158 సీహెచ్‌సీలకు 901 పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. అందులో 73 ట్రాక్టర్లు ఉన్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.13.44 కోట్లు వెచ్చించగా, అన్నదాతలకు రూ.4.49కోట్లు సబ్సిడీ పొందారు. పరికరాల విలువలో రైతులు 10శాతం చెల్లిస్తే, 40శాతం రాయితీలు, 50 శాతం బ్యాంక్ రుణం దశల వారీగా చెల్లిస్తే సరిపోతుంది. గతేడాది తొలి విడతలో 308 సీహెచ్‌సీ గ్రూపులకు 965 పరికరాలు పంపిణీ చేశారు. అందులో 180 ట్రాక్టర్లతోపాటు మరో 42 రకాల పరికరాలు ఉన్నాయి. రూ.30.85 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయగా, రైతులకు రూ.10.27 కోట్లు సబ్సిడీ అందించింది.

నామమాత్ర ధరలతో..

సీహెచ్‌సీ గ్రూపుల ద్వారా ట్రాక్టర్లు పొందిన రైతులు వారి సేద్యం చేసుకోవడంతోపాటు ఆ గ్రామంలోని రైతులకు నామమాత్ర అద్దెకు ఇచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో రైతులు సేద్యం పనులకు ట్రాక్టర్లు, వరికోత యంత్రాలతోపాటు ఇతర పరికరాల కోసం అధికంగా అద్దె చెల్లించాల్సిన అవసరం ఉండదు. తక్కువ అద్దెతో ఈపరికరాలతో వ్యవసాయం చేసుకోవచ్చు.

ఖరీఫ్‌కూ గంగ నీరు

రబీ సీజన్‌కే కాకుండా ఖరీఫ్ సీజన్‌కూ తెలుగుగంగ నీటితోపాటు కాళంగి , అరణియార్, మల్లిమడుగు, సోమశిల–స్వర్ణముఖి నుంచి సాగు నీటిసరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏటా జిల్లాలో 10 వేల నుంచి 25 వేల ఎకరాల బీడు సాగులోకి వస్తోంది. సేద్యం సులభం కావడంతో మహిళా రైతులు సైతం వ్యవసాయం చేస్తున్నారు.



శ్రీకాళహస్తి వ్యవసాయ కేంద్రంలో పరికరాల పంపిణీ

ఇంతలా సాయం ఎప్పుడూ లేదు



ఏ ప్రభుత్వం రైతులకు ఈ స్థాయిలో సాయం చేయలేదు. విత్తు నుంచి కొనుగోలు వరకు బాధ్యతగా సర్కార్ వ్యవహరిస్తోంది. సబ్సిడీతో పరికరాలు ఇవ్వడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. శ్రీవేలమాలమ్మ రైతు మిత్రా సంఘం గ్రూపుల ద్వారా మేము ట్రాక్టర్‌తోపాటు రోటోవేటర్, ప్యాడీ స్ట్రాబ్యాలర్, 9 కల్టివేటర్లు, స్ప్రేయర్లు పొందాం. మాకు వ్యవసాయం చేయడం సులభంగా మారింది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

–భాస్కర్‌రెడ్డి, రైతు, చోడవరం,తొట్టంబేడు

విప్లవాత్మక మార్పులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఒకప్పుడు ట్రాక్టర్ అంటే ఆ గ్రామంలో పెద్ద రైతు. నాలాంటి వారు చాలా మంది ట్రాక్టర్ కొనే ఆర్థిక శక్తి లేక కూలీలుగా వ్యవసాయం చేసుకునే వాళ్లం. అలాంటిది మాకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్రాక్టర్ ఇప్పించారు. నకిలీ విత్తనాలకు చెక్ పెట్టారు. సబ్సిడీతో ఎరువులు, ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించారు. దీంతో వ్యవసాయం సులభంగా మారింది. ఎన్ని ఎకరాలైనా సాగు చేయడంలో ఇబ్బందులు లేవు.

–సురేష్‌కుమార్, బట్టికండ్రిగ, వడమాలపేట

సద్వినియోగం చేసుకోవాలి



రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో రూ.కోట్లు ఖర్చు చేస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని అర్హులైన వారంతా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలి. ట్రాక్టర్లు, ఎరువులు, విత్తనాలు, స్ప్రేయర్లు తదితర పరికరాలే కాకుండా భవిష్యత్‌లో రైతులకు మరింత మేలు చేసేందుకు సర్కార్ సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

చరిత్రలో నిలిచిపోయేలా జగనన్న పాలన

- చారిత్రక విజయానికి నాలుగేళ్లు
- సంబరాల్లో ఎంపీ మద్దిల గురుమూర్తి



సంబరాల్లో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, పార్టీ నాయకులు

తిరుపతి మంగళం : దేశ రాజకీయ చరిత్రలోనే నిలిచిపోయేలా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయానికి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం తిరుపతి ఎంపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు రాక్షస పాలనను తరిమికొట్టి రామరాజ్యం కోసం జగనన్నను ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతించారన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి మించి సంక్షేమ పథకాలను అందించి వారి గుండెల్లో జగనన్న సుస్థిరస్థానం సంపాదించుకున్నారని తెలిపారు. నాలుగేళ్ల పాలనలోనే రాజకీయ చరిత్రలో ఎవ్వరూ అందించలేనని సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి చేసి చూపించిన మహా నాయకుడు జగనన్న అని కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడ జగనన్నను ప్రజలు తిరిగి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి

తిరుమల/తిరుచానూరు (చంద్రగిరి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం వారిని వేదపండితులు ఆశీర్వదించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. అదేవిధంగా ఆయన తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కూడా జస్టిస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

ఆలయ స్థలాల జోలికొస్తే ఊరుకోం



రామకృష్ణారెడ్డి, జిల్లా అధికారి, దేవదాయ శాఖ

తిరుపతి అర్బన్: దేవాలయాల స్థలాల జోలికొస్తే ఊరుకోమని జిల్లా దేవాదాయశాఖ అధికారి పుట్టా రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి కరిమారెప్పగుడి వద్ద ఆలయానికి చెందిన స్థలాన్ని ఆక్రమిస్తే స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న స్థలాలకు స్పష్టమైన సరిహద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ధూపదీప నైవేద్యాలకు దశల వారీగా చిన్న చిన్న ఆలయాలను ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాది వ్యవధిలో తొలి దశలో 90 ఆలయాలను, రెండో దశలో 90, మూడో దశలో 45, నాల్గవ దశలో 45 ఆలయాలను ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు.

దుమ్మురేపారు

- హోరా హోరీగా చంద్రగిరి ఐపీఎల్
- ముగిసిన లీగ్ పోటీలు
- ప్రతిభ చాటిన పల్లె క్రీడాకారులు
- రూ.20వేలు విలువైన క్రికెట్ కిట్లు పంపిణీ చేసిన మోహిత్ రెడ్డి
- మ్యాచ్‌లను నిరంతరం పర్యవేక్షించిన హర్షిత్ రెడ్డి



మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న క్రీడాకారుడు

తిరుపతి రూరల్: ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన ఐపీయల్ పోటీలు తుది దశకు చేరుకున్న రీతిలోనే చంద్రగిరి ఐపీఎల్‌లో సైతం మొదటి దశ లీగ్ పోటీలు పూర్తి అయ్యాయి. మొత్తం 1000 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు 498 మ్యాచ్‌లను నిర్వహించారు. వర్షం వల్ల ఆగిన రెండు మ్యాచ్‌లను బుధవారం నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తుమ్మలగుంటలోని మొత్తం 16 క్రీడా మైదానాల్లో రోజుకు కనీసం 52 మ్యాచ్‌ల చొప్పున 10 రోజుల పాటు బాహుబలి రేంజ్‌లో పోటీలను నిర్వహించారు. వందలాది మంది నిర్వాహక కమిటీ ప్రతినిధులు, 82 మంది నిపుణులైన అంపైర్లతో ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా మొదటి దశ లీగ్ పోటీలను దిగ్విజయంగా పూర్తి చేశారు. పాల్గొన్న ప్రతి జట్టుకు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్‌ను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంపిణీ చేశారు.

బ్యాటింగ్ చేస్తూ..యువతను ప్రోత్సహిస్తూ..

చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న యువత ప్రతి రోజు వందల సంఖ్యలో మ్యాచ్‌లను ఆడేందుకు తుమ్మలగుంటకు విచ్చేశారు.. తమ ఊరి యువత ఆడుతున్న మ్యాచ్‌లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు సైతం బారులు తీరారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వారందరికీ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం టిఫిన్, భోజనం, స్నాక్స్‌లను పంపిణీ చేశారు. మోహిత్‌రెడ్డి క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడుతూ ప్రోత్సాహించారు.

పరుగుల వర్షం...!

తుమ్మలగుంట సమీపంలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన పోటీల్లో యువత సిక్సర్లు కొడుతూ పరుగుల వర్షం కురిపించగా, కొంత మంది బౌలింగ్‌లో సత్తా చాటుతూ వికెట్లు పతనంలో ప్రతిభ చాటారు. బంతులను బౌండరీలు దాటిస్తూ జట్టు స్కోర్‌ను అమాంతం పెంచుతూ ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపారు.

నిరంతర పర్యవేక్షణ

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనలతో ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి టోర్నమెంట్‌ను నిరంతరం పర్యవేక్షించారు. ప్రతి మ్యాచ్‌ను మోహిత్‌రెడ్డి ప్రారంభిస్తూ క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ మెడల్స్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. క్రీడాకారులు సెల్ఫీలు తీసుకుంటూ అభిమానం చాటారు. హర్షిత్‌రెడ్డి టీ షర్టులు, పార్టిసిపేట్ సర్టిఫికెట్‌లను జేసి మ్యాచ్ మొత్తాన్ని పర్యవేక్షించారు.



బౌలింగ్‌లో ప్రతిభ చాటుతూ...



కొడితే సిక్సే...

క్లుప్తంగా

పద్మావతీ అమ్మవారికి ముత్యాల హారం కానుక



హారాన్ని అధికారులకు అందజేస్తున్న దాతలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారికి భక్తులు ముత్యాలహారాన్ని కానుకగా అందజేశారు. ఒంగోలుకు చెందిన వరప్రసాద్ దంపతులు మంగళవారం ఆలయానికి చేరుకుని హారాన్ని ఆలయ సూపరింటెండెంట్ శేషగిరికి అందజేశారు. సుమారు రూ.52వేల విలువైన ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించాలని దాతలు కోరారు. అనంతరం వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అర్చకుడు బాబు స్వామి, వీఐ రామ్మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

31న మయూర షుగర్స్ ఆస్తుల వేలం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సుదలగుంట(మయూర) షుగర్ ఫ్యాక్టరీ భూములు, ఆస్తులను ఈనెల 31వ తేదీ వేలం వేయనున్నట్లు తహసీల్దారు హనుమాన్‌నాయిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వానికి పన్ను బకాయిల చెల్లించక పోవడంతో స్వాధీనం చేసుకున్న భూములు, ఆస్తులను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ సమర్పించిన మార్కెట్ విలువలతో వేలం వేయనున్నట్లు తెలిపారు.

ప్రయోగానికి జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 సిద్ధం

- రాకెట్ అనుసంధానం పూర్తి
- 3 దశల్లోనే రోదసిలోకి ..
- జీఎస్‌ఎల్‌వీ మార్క్2 సిరీస్‌లో 15వ ప్రయోగం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 ద్వారా 2,232 కిలోల బరువు కలిగిన నావిగేషన్ శాటిలైట్ (నావిక్–01)ను ఈనెల 29 ఉదయం 10.42 గంటలకు ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేస్తున్నారు. పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్‌ఎల్‌వీని మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. దేశీయ నావిగేషన్ అవసరాల నిమిత్తం, దేశంలో దిక్సూచి వ్యవస్థ కోసం ఈ రాకెట్ పనిచేస్తుంది.



షార్ రెండో ప్రయోగ వేదికపై మొదటి దశ అమరిక



రెండోదశలో ద్రవ ఇంధనం అమర్చుతున్న దృశ్యం



మూడు దశలతో కూడిన జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12

శ్రీహరికోట(సూళ్లూరుపేట) : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)నుంచి 49.13 మీటర్లు పొడవున్న జీఎస్‌ఎల్‌వీ ఎఫ్ 12 రాకెట్ ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేస్తున్నారు. జీఎస్‌ఎల్‌వీ మార్క్2 సిరీస్‌లో ఇది 15వ ప్రయోగం. దేశీయ నావిగేషన్ అవసరాల నిమిత్తం, దేశంలో దిక్సూచి వ్యవస్థ కోసం ఈ ఉపగ్రహం పనిచేస్తుంది. ఈ ఉపగ్రహం 10సంవత్సరాలు రోదసీలో ఉండి పనిచేస్తుందని ఇస్రో శాస్త్రవేత్తలు తెలియజేశారు. ప్రయోగ సమయంలో 416 టన్నుల బరువుతో భూమినుంచి నింగికి బయలు దేరుతుంది. ఈ ప్రయోగంలో 2,232 కిలోలు బరువు కలిగిన నావిక్–01 ఉపగ్రహాన్ని రోదసిలోకి పంపనున్నారు. రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పూర్తి చేశారు. రాకెట్‌కు పైభాగంలో ఉపగ్రహాన్ని పొందికగా అమర్చే ప్రక్రియను పూర్తి చేసి సిద్ధంగా ఉంచారు. బెంగళూరు నుంచి వచ్చిన ఉపగ్రహాన్ని క్లీన్‌రూంలో పలు రకాల తనిఖీలు నిర్వహించి, హీట్‌షీల్డ్ క్లోజ్ చేసిన విభాగాన్ని రాకెట్ శిఖర భాగంలో అమర్చేందుకు ఎస్‌ఎస్‌ఏబీ నుంచి వ్యాబ్‌కు తరలించి అనుసంధానం పూర్తి చేశారు. ప్రస్తుతం లెవెల్–1 తనిఖీలను పూర్తి చేసి లెవెల్–2 తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 రాకెట్‌ను దశల వారీగా అనుసంధానించే దృశ్యాలను విడుదల చేసింది.



రాకెట్ శిఖర భాగాన అనుసంధానం చేసేందుకు తరలింపు



పొందికగా ఉపగ్రహంలో పరికరాల అమరిక



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,170
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,583
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,800
రిటైల్ వెండి గ్రాము	రూ.74.80

ఫీల్డ్ అసిస్టెంట్ బెదిరింపులపై ఫిర్యాదు

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ దిండు తిరుపతి తనపై పరుష పదజాలంతో ఫోన్‌లో బెదిరింపులకు గురి చేస్తున్నాడని స్థానిక ఎంపీటీసీ సల్లా మధుసూదనరావు మంగళవారం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. ఇటీవల కారిపాకంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఫీల్డ్ అసిస్టెంట్ హాజరు కాకుండా స్థానికంగా ఉన్న గ్రామస్తులను సైతం పనులకు తీసుకు వెళ్లడంపై ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిపై విచారణ చేపట్టి తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీనిపై విచారణ జరుగుతుండగా ఎంపీటీసీ సభ్యుడు మధుసూదనరావుపై ఫీల్డ్ అసిస్టెంట్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఊర్లోకి రానివ్వనంటూ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ఫోన్‌లో సైతం పరుష జాలంతో దూషిస్తున్నాడు. గిరిజనకాలనీకి చెందిన ఓ మహిళ రోజు వారీ పనులకు హాజరు కాకపోయినా మస్టర్ వేసి నగదు స్వాహా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిని బెదిరింపులకు గురి చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్యాంకర్

- పామోలిన్ ట్యాంకర్ బోల్తా
- నేలకొరిగిన రెండు స్తంభాలు



నేలకొరిగిన స్తంభాల కింద బోల్తాపడిన ట్యాంకర్

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి వద్ద మంగళవారం 33 కేవీ లైన్ స్తంభాన్ని పామోలిన్ ట్యాంకర్ ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లింది. సీఐ శ్రీహరి కథనం మేరకు.. నెల్లూరు నుంచి బెంగుళూరుకు పామోలిన్‌తో వెళుతున్న ట్యాంకర్ ఇసుకతాగేలి వద్ద ఎదురుగా వస్తున్న లగేజీ వ్యానును తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న 33 కేవీ లైన్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ట్యాంకరు బోల్తాపడింది. డ్రైవర్ షేక్ రఫీ(45)కు స్వల్ప గాయాలయ్యాయి. రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమాచారం అందిన వెంటనే ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. శ్రీకాళహస్తి 132 కేవీ లైన్ నుంచి గ్రామాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను అందజేశారు. బుధవారం నుంచి 33 కేవీలైన్ మరమ్మతులు చేపడుతామని తెలిపారు. ప్రమాదంతో సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని ఏఈ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 25వ డివిజన్ సచివాలయ అమిటీ కార్యదర్శి ఎం.పూర్ణచంద్ర, సంస్థకు చెడ్డ పేరు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్న కార్పొరేషన్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.రాహిత్యను సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

శెట్టిపల్లె పేదల కల సాకారానికి కృషి

- పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతాం
- భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో సమావేశం



శెట్టిపల్లె భూములపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీషా, కమిషనర్ హరిత

తిరుపతి అర్బన్: ఏళ్ల తరబడిగా శెట్టిపల్లె భూముల్లో రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాలు జరగక, కుటుంబ అవసరాలకు డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్న వేలాది కుటుంబాల్లో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి వెలుగులు నింపనున్నారు. శెట్టిపల్లె భూముల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన సుమారు 3వేల మంది పేదల కల సాకారం కానుంది. ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన పేదలకు త్వరలోనే వాటిని అందించేందుకు వారు తీవ్రంగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే శెట్టిపల్లె భూములను అభినయ్‌రెడ్డి పలుదఫాలు పరిశీలించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కార్పొరేషన్ సహకారంతో లేవుట్లు వేసి అభివృద్ధి చేసి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఆర్డీవో కనకనరసారెడ్డి, అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ అధికారులు, కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి శెట్టిపల్లి భూముల సమస్యల పరిష్కార విషయమై సమావేశం నిర్వహించారు. పేదల స్థలాలు వారికి కేటాయిస్తే వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన వాళ్లమవుతామని ఎమ్మెల్యే ఈసందర్భంగా కలెక్టర్‌తో అన్నారు. పేదలకు సాయం చేయడానికి రెవెన్యూ నుంచి సహకారం ఉంటుందని కలెక్టర్ వివరించారు.

నయవంచకుడు చంద్రబాబు

గత టీడీపీ ప్రభుత్వంలో ల్యాండ్ పూలింగ్ పేరుతో పేదల ఇళ్ల స్థలాలను లాక్కునేందుకు చంద్రబాబు కుట్రలు పన్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. శెట్టిపల్లి రైతులు భూములతో పాటు కూలీనాలి చేసుకుని కొనుగోలు చేసిన వేలాది మంది పేదల భూములను సైతం ల్యాండ్ పూలింగ్ పేరుతో రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాలు జరగకుండా ఆపేసిన దుర్మార్గుడు చంద్రబాబు అన్నారు. దాంతోపాటు తిరుపతి నగరంలోని అనేక ప్రాంతాల్లో 22 ఏను తీసుకొచ్చి రిజిస్ట్రేషన్లు జరగకుండా చేసింది చంద్రబాబేనని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో మాట్లాడి తిరుపతిలో 22ఏను రద్దు చేసి భూ యజమానులకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 15 కంపార్టుమెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 78,349 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 39,634 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.56 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే తిరుమలలో వర్షం కురవడంతో భక్తులు ఎక్కడికి అక్కడ షెల్టర్ల కింద ఉండిపోయారు.

చీటింగ్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చీటింగ్ కేసులో కర్ణాటక భాగలకోట జిల్లా జమకండి తాలూకా సావలగిరి గ్రామానికి చెందిన పి.నితిన్‌కు 2 నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పుచెప్పారు. కోర్టు కానిస్టేబుల్ శివుడు తెలిపిన వివరాల మేరకు.. 2015 సెప్టెంబర్ 2వ తేదీ నిందితుడు నితిన్ కర్ణాటక బీజాపూర్‌కు చెందిన ఉదయ్ ట్రావెల్స్ యజమాని బీజీ.ఉదయ్‌కుమార్‌కు ఓ కాయిన్ బాక్స్ ద్వారా ఫోన్‌చేసి తనకు తెలిసిన విదేశీ ప్రతినిధులు తిరుమలకు వస్తున్నారని, వారిని అక్కడి నుంచి తీసుకురావడానికి ఓ వాహనాన్ని అద్దెకు ఇవ్వాలని కోరాడు. దీంతో అతను తన డ్రైవర్ ద్వారా వాహనాన్ని నితిన్‌కు ఇచ్చి పంపాడు. ఇద్దరూ కలిసి తిరుమల నందకం గెస్ట్‌హౌస్ వద్ద వాహనాన్ని పార్కింగ్ స్థలంలో నిలిపారు. 2015 సెప్టెంబర్ 3వ తేదీ నిందితుడు నితిన్ నందకం గెస్ట్‌హౌస్ 534 గదికి వెళ్లి ఆ గదిలో ఉన్న వారి వద్ద డబ్బు తీసుకురావాలని కారు డ్రైవర్‌కు తెలిపారు. వాహన తాళాలు తనకిచ్చి వెళ్లాలని, వాహనంలో సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టానని తెలిపారు. అతని మాటలు నమ్మిన డ్రైవర్ కారు తాళాలు నితిన్‌కు ఇచ్చి గెస్ట్‌హౌస్ లోపలికి వెళ్లిరాగా, కారుతో సహా నితిన్ కనపడకుండా పోయారు. ఫిర్యాదు మేరకు తిరుపతి సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు నితిన్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు.

మట్టిని పరిరక్షిద్దాం .సారవంతాన్ని కాపాడుదాం



పర్యావరణ ప్రేమికులతో కలిసి మాట్లాడుతున్న మోహిత్ నిరంజన్

తిరుపతి కల్చరల్: ప్రకృతిని అపరిమితంగా వినియోగించుకోవడంతో మట్టిలో సారం నిర్జీవమై మానవ మనుగడకే ప్రమాదంగా మారుతోందని.. మట్టిలో సారవంతాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సైకిల్ యాత్రకుడు ఉత్తర ప్రదేశ్ మోహిత్ నిరంజన్ పిలుపు నిచ్చారు. మట్టిని పరిరక్షించాలని కోరుతూ ఉత్తరప్రదేశ్ లలిత్‌పూర్‌కు చెందిన మోహిత్ నిరంజన్ గత ఏడాది మార్చి 20వ తేదీన ఉత్తరప్రదేశ్ నుంచి దేశవ్యాప్త సైకిల్ ర్యాలీ చేపట్టారు. యాత్రలో భాగంగా మంగళవారం తిరుపతికి చేరుకున్న ఆయన ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. మట్టిని రక్షించు అనే నినాదంతో ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 200 రోజులుగా సైకిల్ యాత్ర చేస్తున్నానని తెలిపారు. ఒకప్పుడు సేంద్రియ ఎరువులతో పంటలు పండించి ఎంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపిన జనం నేడు రసాయనిక ఎరువుల వినియోగం, ప్లాస్టిక్ వినియోగం, కలుషిత రసాయనాలు జీవనదులలో కలవడం, అడవుల శాతం తగ్గిపోవడం వంటి కారణాలతో నేడు భూమిపై అంచనా వేయలేని వాతావరణ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు ఆహార పదార్థాలు అందించడం తీవ్ర కష్టసాధ్యమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా మేల్కొని మట్టిలో ప్రస్తుతం 0.5 ఉన్న సేంద్రియ శాతాన్ని మూడు నుంచి ఆరు వరకు పెరిగేలా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాకు చెందిన పర్యావరణ ప్రేమికుడు శివాజీ మాట్లాడుతూ శేషాచలం అడవుల్లో ఉన్న ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమంలో స్వచ్ఛందంగా పని చేశామన్నారు. పర్యావరణ ప్రేమికులు జగన్నాథం, డాక్టర్ నీలిమ, డాక్టర్ కిషోర్, సోమేశ్వర్, రాజేష్, చైతన్య పాల్గొన్నారు.

రామ్‌సునీల్ రెడ్డి పదవీకాలం పెంపు



దేవపట్ల రామ్‌సునీల్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతికి చెందిన ఎస్‌డీహెచ్‌ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ దేవపట్ల రామ్‌సునీల్‌రెడ్డి టీటీడీ గోసంరక్షణ ట్రస్ట్ సభ్యత్వ పదవిని మరో ఏడాది పొడిగించారు. ఆమేరకు ఈవో ధర్మారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గోసంరక్షణ ట్రస్ట్ సభ్యుడుగా ఉన్న రామ్‌సునీల్‌రెడ్డి గోశాలలో పలు అభివృద్ధి పనుల్లో కీలకపాత్ర పోషించారు. గోఆధారిత ఉత్పత్తుల తయారీ, వాటికి కావాల్సిన మౌలిక వసతుల కల్పన, సమీకృత దాణా తయారీ కేంద్రం ఏర్పాటులోనూ ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన టీటీడీ మరో ఏడాదిపాటు పదవీకాలాన్ని పొడిగించింది. ఈ సందర్భంగా పలువురు రామ్‌సునీల్‌రెడ్డిని అభినందించారు.

29 నుంచి పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

- 25 నుంచి ఆన్‌లైన్లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు



తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 29నుంచి జూన్ 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన(కౌన్సెలింగ్) ప్రక్రియ ప్రారంభం కానుంది. తిరుపతి జిల్లాకు సంబంధించి తిరుపతి కపిలతీర్థం రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి ఆయా తేదీల్లో ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. వివిధ కేటగిరి విద్యార్థులకు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఈ నెల 25నుంచి జూన్ 1వ తేదీలోపు ఏపీపీఓఎల్‌వైసీఈటీ.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో ప్రాసెసింగ్ ఫీజు (ఓసీ, బీసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250) చెల్లించాలన్నారు. కౌన్సెలింగ్ పూర్తయినవారు జూన్ 1నుంచి 6వ తేదీ లోపు చేరదలచిన కళాశాలలు, కోర్సుల వివరాలతో ఆప్షన్స్ ఎంచుకోవాలని, 7వ తేదీన ఆప్షన్స్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవాలని, జూన్ 9న అలాట్‌మెంట్‌ను ప్రకటిస్తారని పేర్కొన్నారు.

విజయవాడలో వివిధ కేటగిరి విద్యార్థులకు..

ఎన్‌సీసీ, స్పోర్ట్స్, ఫిజికల్ హ్యాండీ క్యాప్, సీఏపీ, ఆంగ్లో ఇండియన్ తదితర కేటగిరి విద్యార్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

తేదీలు, ర్యాంకుల వారీగా పరిశీలన

తేదీ	నుంచి	వరకు
29-05-23	01	12,000
30-05-23	12,001	28,000
31-05-23	28,001	43,000
01-06-23	43,001	58,000
02-06-23	53,001	74,000
03-06-23	74,001	91,000
04-06-23	91,001	1,08,000
05-06-23	1,08,001	చివరి ర్యాంకు వరకు

సర్టిఫికెట్ల పరిశీలనకు తీసుకురావాల్సినవి..

సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు పేమెంట్ రిసిప్ట్, ఏపీ పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి, తత్సమాన మార్కుల జాబిత, 4నుంచి 10వ తరగతి వరకు స్టడి సర్టిఫికెట్/రెసిడెన్షియల్ సర్టిఫికెట్, 2023-24కు సంబంధించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్(ఓసీలు), 01-01-2020 తరువాత జారీచేసిన ఇన్‌కం సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్(బీసీ, ఎస్సీ, ఎస్టీ), టీసీ ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకెళ్లాలి.